JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । శనివారం 18-10-2025
Medchal - Malkajgiri । Saturday 18-10-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 142 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 142 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




## నాకు చాలా సంతోషంగా ఉంది

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

జయభేరి, న్యూఢిల్లీ:

మావోయిస్టుల లొంగుబాటుపై హోం మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. మావోయిస్టులకు బలమైన స్థావరాలు ఛత్తీస్గ గఢ్, అబూజ్మడ్, ఉత్తర బస్తర్లు వారినుంచి విముక్తి పొందినట్లు ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. దక్షిణ బస్తర్లోని మావోయిస్టుల జాడను భద్రతా బలగాలు త్వరలో పూర్తిగా నిర్మూలిస్తాయని చెప్పారు. మా విధానం ఒక్కటే..మావోయిస్టుల లొంగుబాటు ను స్వాగతీస్తున్నాం. సాయుధ పోరాటం కొనసాగించే వారిని మా బలగాలు ఎదుర్కొంటాయి. నక్సలైట్లు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలవాలని పిలుపునిస్తున్నానని అన్నారు. గత యేడది జనవరి నుంచి చత్తీస్ ఘఢ్ లో 2100 మంది మావోయిస్టులు లొంగిపోయారు. 1785 మంది అరెస్టు అయ్యారు. 477 మంది మృతి చెందారని అన్నారు.



## విద్యాశాఖపై సమీక్ష

పేదలకు మెరుగైన విద్య అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు తొలి దశలో ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఏరియాలో ఉన్న పాఠశాలల పై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్లే గ్రౌండ్, అవసరమైన తరగతి గదులతోపాటు మంచి వాతావరణం ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. స్థల సమస్య వల్ల సౌకర్యాల లేమి ఉన్న పాఠశాలలను దగ్గరలో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి, అక్కడకు తరలించాల్సిందిగా ఆదేశించారు. నర్సరీ నుంచి 4 వ తరగతి వరకు నూతన స్కూల్స్ ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలి. విద్యార్థులకు పాలు, బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నూతన పాఠశాలలు ప్రారంభం 2026 అకడమిక్ సంవత్సరం నుంచి అమలు జరిగేలా కార్యచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు.

జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్రంలో మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు పాలు, బ్రేక్ఫాస్ట్, లంచ్ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 2026 విద్యా సంవత్సరం జూన్ నుంచి అమలు జరిగే విధంగా ఈ కార్యాచరణ ప్రణాళిక ఉండాలని చెప్పారు. విద్యా శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, వేంనరేందేర్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి. బాలకిష్టా రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పించాల్సిన అవసరం ఉందని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు. తొలి దశలో ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ప్రాంతంలో దృష్టి సారించాలని చెప్పారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్కూళ్లకన్నా మెరుగ్గా ఉండాలని, ప్లే గ్రౌండ్, అవసరమైన తరగతి గదులతోపాటు మంచి వాతావరణం ఉండేలా చూడాలని చెప్పారు. ఇలాంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి విద్యా శాఖ పరిధిలో ఉన్న స్థలాలను గుర్తించాలని సూచించారు. సరైన సౌకర్యాలు లేని పాఠశాలలను దగ్గరలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలకు తరలించాలని చెప్పారు. నర్సరీ నుంచి 4 వ తరగతి వరకు నూతన స్కూల్స్ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. అక్కడ కార్పొరేట్ స్కూల్ స్థాయిలో అన్ని వసతులతో విద్యను అందించే ఏర్పాటు చేయాలని సూచించారు.

## తెలంగాణ మెడికల్ డివైసెస్ పార్క్

- కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనం.. కేటీఆర్
- హ్యూవెల్ (Huwel) నూతన కెమిస్ట్రీ ల్యాబ్ను ప్రారంభించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- సామాన్యుడికి లాభం చేకూర్చని పరిశోధన నిష్ఫలం: కేటీఆర్

జయభేరి, హైదరాబాద్ :



తెలంగాణ రాష్ట్రంలోని సుల్తాన్పూర్ మెడికల్ డివైసెస్ పార్క్లో హ్యూవెల్ (Huwel) సంస్థ ఏర్పాటు చేసిన నూతన కెమిస్ట్రీ ల్యాబ్ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాంత బయోటెక్ ఎండీ వర ప్రసాద్ రెడ్డి , హ్యూవెల్ కంపెనీ ఎండీ, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ మెడికల్ డివైసెస్ పార్క్ ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరించారు. "మన దేశంలో 70, 8 నుంచి 80% మనం వాడే మెడికల్ పరికరాలన్నీ కూడా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అట్లా ఎందుకు ఉండాలి? మన దేశంలో ఎందుకు ఈ ఉత్పత్తులు కాకూడదు?" అనే ఆలోచనతో కేసీఆర్ ప్రభుత్వంలో ఈ మెడికల్ డివైసెస్ పార్క్ ఏర్పాటు చేయడం జరిగింది. మన దేశంలో ఉత్పత్తి అయితే ధర కూడా తగ్గి,

...మిగతాది 2 లో

## భవిష్యత్తును మార్చేది సంస్కరణలే

- సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ క్యాంపైన్ కాంపిటిషన్లో గెలుపొందిన విద్యార్థులను కలిసిన ముఖ్యమంత్రి
- విజేతలకు సర్టిఫికెట్లు అందచేసిన సీఎం బాబు

జయభేరి, అమరావతి, అక్టోబర్ 17:



భవిష్యత్తును మార్చేది సంస్కరణలేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా.. సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సూపర్ జీఎస్టీసూపర్ సేవింగ్స్ ప్రచారంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లోని విజేతలు శుక్రవారం ముఖ్యమంత్రిని రాష్ట్ర సచివాలయంలో కలిశారు. 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన 17 మంది విద్యార్థినీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విజేతలకు సీఎం చంద్రబాబు సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీ సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలను అర్థం చేసుకున్నారా..?

...మిగతాది 2 లో

## నేడు తెలంగాణ రాష్ట్రం బంద్

- బస్సులు నడప వద్దు షాపులు తెరవ వద్దు
- బంద్కు సహకరించాలని బీసీ జేఏసీ పిలుపు.
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య


జయభేరి, హైదరాబాద్ :



బీసీ రిజర్వేషన్ల పై హైకోర్టు ఇచ్చిన స్టేను నిరసిస్తూ నేడు తలపెట్టిన రాష్ట్ర బంద్ను విజయవంతం చేయాలని తెలంగాణ బీసీ జేఏసీ పిలుపునిచ్చింది. బస్సులు నడప వద్దు విద్యాసంస్థలు తెరవవద్దు వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బంద్ చేయాలని కోరింది. గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద బంద్కు సంబంధించిన వాల్ పోస్టర్ను జేఏసీ చైర్మన్ ఆర్. కృష్ణయ్య , వైస్ చైర్మన్ వీజీఆర్ నారగొని, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ , కో చైర్మన్ రాజారామ్ యాదవ్ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఈ బంద్ తో బీసీల సెగ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసేలా బీసీలు కదిలిరావలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ యాజమాన్యంతో పాటు, విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బంద్ కు సహకరించాలని కోరారు. బంద్ కు మద్దతుగా అన్ని రాజకీయ పార్టీ నాయకులను కలుస్తాము అన్నారు. మద్దతు ఇవ్వని పార్టీలకు బీసీల ఓట్లు అడిగే హక్కు లేదుఅన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ వడ్డేపల్లి హనుమంతు, జేఏసీ నాయకులు గుజ్జ కృష్ణ , గుజ్జ సత్యం, కుందారపు గణేష్ చారి, కుల్కచర్ల శ్రీనివాస్, వేముల రామకృష్ణ , నీల వెంకటేశ్, శ్యామ్ కుర్మ , విజయ్, లింగం గౌడ్, జిల్లపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

## నేడు తెలంగాణ బంద్.. డీజీపీ స్ట్రాంగ్ వార్నింగ్..!

జయభేరి, హైదరాబాద్:




నేడు వివిధ పార్టీలు తలపెట్టిన బంద్ కార్యక్రమాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. బంద్ పేరుతో అవాంచనీయ సంఘటనలకు గానీ, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు గానీ పాల్పడినట్లయితే చట్టం ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని డిజిపి అన్నారు. పోలీస్ సిబ్బంది, నిఘా బృందాలు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తాయని, బంద్ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని డిజిపి సూచించారు. సాధారణ ప్రజలకు సమస్యలు ఎదురవకుండా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. కాగా 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం బీసీ సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ బంద్కు పిలుపునిచ్చాయి. ఈ బంద్కు అధికార కాంగ్రెస్ పార్టీ సహా, బీజేపీ, బీఆర్ఎస్ మద్దతు తెలిపాయి. అటు సుప్రీంకోర్టులో తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి బిగ్ షాక్ తగిలింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ను సుప్రీంకోర్టు తోసిపుచ్చడంతో, పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సుప్రీంకోర్టు ఆదేశిచింది.

## 25 నుంచి కవిత యాత్ర

జయభేరి, నల్గొండ, అక్టోబరు 17:



తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, ప్రభుత్వ హామీల అమలుపై దృష్టి సారించే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 'జాగృతి జనయాత్ర' చేపట్టనున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఈ యాత్ర ప్రారంభం కానున్నట్లు జాగృతి నాయకులు అధికారికంగా వెల్లడించారు.యాత్రకు సంబంధించిన కార్యాచరణపై చర్చించేందుకు శుక్రవారం రంగారెడ్డి జిల్లా జాగృతి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ భేటీకి రాష్ట్ర నాయకులు కోల శ్రీనివాస్, నరేష్, అర్చన సేమపతి హాజరయ్యారు. యాత్రను విజయవంతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై జిల్లా ముఖ్య నాయకులతో వీరు సమీక్ష నిర్వహించారు.సామాజిక తెలంగాణ సాధన, బీసీ రిజర్వేషన్ల పెంపు, ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీల అమలు వంటి ప్రధాన డిమాండ్లతో కవిత ప్రజల ముందుకు వెళ్లనున్నారని నాయకులు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలతో మమేకమవుతూ... నిరుద్యోగులు, రైతులు, మహిళలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా మహిళా అధ్యక్షురాలు బండారి లావణ్యతో పాటు రాష్ట్ర స్థాయి నేతలు ముస్తఫా, రామకోటి, రాము యాదవ్, నవీన్ గౌడ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ అరెస్ట్ లపై సుప్రీం సీరియస్



జయభేరి, న్యూఢిల్లీ అక్టోబరు 17 :

డిజిటల్ అరెస్టుల నేరాలు రోజురోజుకూ పెరిగిపోతుండటంతో సుప్రీంకోర్టు ఈ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇది సైబర్ నేరం, నేరస్తులు అమాయకులకు ఫోన్ చేసి డ్రగ్స్ కేసులో ఇరుక్కున్నారని, లేక మీ పేరుతో నకిలీ బంగారం, డ్రగ్స్ దొరికాయని.. తాము సీబీఐ, ఈడీ అధికారులం అని నమ్మించి అరెస్ట్ చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఫేక్ ఉత్తర్వులను ఉపయోగించి ప్రజలను మోసం చేస్తారు.హర్యానాలోని అంబాలాకు చెందిన ఒక కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. ఇక్కడ ఒక సీనియర్ సిటిజన్ జంటను కోర్టు పత్రాలు అని చూపిస్తూ కుట్రపూరితంగా కొందరు మోసం చేశారు. సీనియర్ సిటిజన్లు దీని వల్ల రూ .1.05 కోట్లు మోసపోయారు.

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## తెలంగాణ మెడికల్ డివైసెస్ పార్క్

సామాన్యుడికి ఇవన్నీ అందుబాటులోకి వస్తాయన్న ఉద్దేశంతోనే దీనిని ఏర్పాటు చేశామని కేటీఆర్ తెలిపారు. పార్క్ ఏర్పాటుకు ముందు సుల్తాన్పూర్ ఏరియాలో స్టోన్ క్రషర్లు, మెటల్ క్రషర్లు, కొంత ఖాళీ జాగా తప్ప ఏమీ లేదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఇక్కడికి వస్తే వేల మంది పని చేస్తుండటం, అనేక పరిశ్రమలు రావడం చూసి చాలా సంతోషం అనిపించిందని అన్నారు. ఇక్కడ జరిగిన పరిశోధనలు, ప్రవేశపెట్టిన ఉత్పత్తులు చూస్తే తనకు విశ్వాసం కలిగిందని తెలిపారు.

**కోవిడ్ సమయంలో హ్యూవెల్ కృషికి కేటీఆర్ ప్రశంస**

కోవిడ్ సమయంలో ఆర్టీపీసీఆర్ (RTPCR) టెస్టుకు, కోవిడ్ కిట్స్కు విపరీతమైన గిరాకీ, డిమాండ్ ఉండేదని, ఆ రోజుల్లో టెస్ట్ కిట్ కావాలంటే చాలా పెద్ద ఎత్తున ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉండేదని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ, హ్యూవెల్ సంస్థకు చెందిన శిశిర్, రచన, వారి బృందం మొత్తం కలిసి అప్పట్లో ₹6,000 ఖర్చయ్యే ఒక టెస్ట్ ధరను కేవలం ₹12కు తగ్గించామని చెప్పడం అద్భుతమని కొనియాడారు. పోర్టబుల్ ఆర్టీపీసీఆర్ కిట్ వంటి ఉత్పత్తుల ద్వారా ధరలు తగ్గించి సామాన్యుడికి మేలు చేసే పరిశోధనలు, కార్యక్రమాలు చేస్తున్నందుకు కేటీఆర్ హ్యూవెల్ బృందాన్ని అభినందించారు.

## భవిష్యత్తును మార్చేది సంస్కరణలే

అని వారిని సీఎం అడిగారు. నిత్యావసరాల్లోని చాలా వస్తువులు సున్నా శాతం, 5 శాతం స్లాబ్ పరిధిలోకి వస్తున్నాయని.. దీని వల్ల చాలా వరకు ధరలు తగ్గుతాయని విద్యార్థులు చెప్పారు. నాటిన కొంత కాలానికి చెట్టు ఫలాలు ఇస్తున్నట్టు... సంస్కరణలను ఇప్పుడు అమలు చేస్తే కొన్ని రోజుల తర్వాత ఆ ఫలితాలు ప్రజలకు అందుతాయని సీఎం వివరించారు. జీఎస్టీ వంటి సంస్కరణలను అర్థం చేసుకుని వాటిపై ఎస్సే రైటింగ్ కాంపిటీషన్లు, పెయింటింగ్, ఉపన్యాస పోటీల్లో పాల్గొనడం... వాటిల్లో విజేతలుగా నిలవడం అభినందించదగ్గ విషయమని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డిజిటల్ అరెస్ట్ లపై సుప్రీం సీరియస్

అయితే డిజిటల్ అరెస్టు మోసాలపై అభిప్రాయం చెప్పాలని కేంద్ర ప్రభుత్వం, సీబీఐకి నోటీసులు జారీ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జాయ్మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం డిజిటల్ అరెస్ట్ ముప్పు తీవ్రతపై ఆందోళన వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులు, న్యాయపరమైన సంతకాల ఫోర్జరీలతో వ్యక్తులను మోసం చేయడమే కాకుండా న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని కూడా డిజిటల్ అరెస్టులు దెబ్బతీస్తాయని ధర్మాసనం పేర్కొంది."ఈ కేసు ఒక్కటే కాదు. న్యాయపరంగా డిజిటల్ అరెస్టులను పరిశీలించాలనుకుంటున్నాం. దేశంలోని పలు ప్రాంతాల్లో ఇలాంటి నేరాలు జరిగినట్లు మీడియాలో చాలాసార్లు చూశాం. కనుక న్యాయపరమైన పత్రాలను ఫోర్జరీ చేయడం, అమాయకులను దోచుకోవడం/ దోపిడీ చేయడం, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లను టార్గెట్ చేసి నేరాలు జరుగుతున్నాయి. అందువల్ల డిజిటల్ అరెస్ట్ నేరాలను పూర్తి స్థాయిలో వెలికితీసేందుకు కేంద్ర, రాష్ట్ర పోలీసుల మధ్య చర్యలు జరగాలి. అందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాము" అని ధర్మాసనం తెలిపింది. 73 ఏళ్ల మహిళ ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయి కి లేఖ రాయడంతో ఈ స్కామ్ వెలుగులోకి వచ్చింది. సిబిఐ, ఈడి అధికారులమని చెప్పుకుంటూ మోసగాళ్లు ఆడియో, వీడియో కాల్‌ల ద్వారా జంటను బెదిరించారు. సెప్టెంబర్ 3, 16 మధ్య తేదీలు కలిగిన నకిలీ అరెస్టు, నిఘా ఉత్తర్వులపై నకిలీ కోర్టు స్టాంపులు, సీల్స్ ఉన్నాయి, ఇది బాధితులను బహుళ బ్యాంక్ లావాదేవీల ద్వారా పెద్ద మొత్తంలో డబ్బును బదిలీ చేయడానికి ఒప్పించింది. దేశవ్యాప్తంగా సీనియర్ సిటిజన్లను, చదువురాని వారితో పాటు డాక్టర్లు, ఇంజినీర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులను సైతం లక్ష్యంగా చేసుకుని ఇలాంటి డిజిటల్ అరెస్టు మోసాలు జరుగుతున్నాయని మీడియా కథనాలను కోర్టు ప్రస్తావించింది. ఇటువంటి నేరపూరిత కార్యకలాపాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని కేంద్ర, రాష్ట్రాల దర్యాప్తు సంస్థలు మధ్య సమన్వయం చేసుకోవాలని సూచించింది.అటార్నీ జనరల్ అభిప్రాయం సహాయం కోరిన సుప్రీం ధర్మాసనం, హర్యానా ప్రభుత్వం, అంబాలా సైబర్ క్రైమ్ విభాగాన్ని దర్యాప్తుపై స్టేటస్ నివేదికలను సమర్పించాలని తాజాగా ఆదేశించింది. భారతీయ న్యాయ సంహిత సంబంధిత నిబంధనల ప్రకారం ఇప్పటికే రెండు ఎఫ్ఐఆర్లు నమోదు చేశారు.

## మెట్రో టేకోవర్ సాధ్యాసాధ్యాలపై చర్చ



**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 17:**

హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ వేగవంతం చేయడంతో పాటు ఎల్ అండ్ టీ నుంచి మెట్రో టేకోవర్ సాధ్యాసాధ్యాలు, ఖర్చు వివరాలపై తెలంగాణ కేబినెట్ గురువారం చర్చించింది. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల అర్హతలపై సైతం మంత్రి మండలి ఫోకస్ చేసింది. రైతులనుంచి మొత్తం ధాన్యం సేకరించాలని నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. 78 యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల కాంప్లెక్సులను నిర్మించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రతీ కాంప్లెక్స్ నిర్మాణం కోసం రూ.200 కోట్లు ఖర్చు చేయనుంది, దీంతో మొత్తం రూ.15,600 కోట్లు ఖర్చు చేయడానికి ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఆర్థిక శాఖ అనుమతులు ఇచ్చేందుకు అంగీకరించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ద్వారా, సీఎం రేవంత్ రెడ్డి కార్యాలయానికి విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యంగ్ ఇండియా గురుకుల స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణాల ఫైల్ పంపించారు. ఈ నిర్మాణ ప్రతిపాదనల్ని తెలంగాణ మంత్రిమండలి గురువారం ఆమోదించింది.202526 ఏడాదికి వెయ్యి పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించేందుకు తెలంగాణ మంత్రిమండలి ఆమోదం తెలిపింది. గత సంవత్సరంలో 250 పాఠశాలల్లో ఈ తరగతులు ప్రారంభించగా, ఈ ఏడాది మరో 210 పాఠశాలల్లో విస్తరించాయి. మొత్తం పాఠశాలల సంఖ్య 460కి చేరుకుంది. అదనంగా పీఎంశ్రీ పథకంలో 112 పాఠశాలలు ఉన్నాయి. ఈ పూర్వ ప్రాథమిక పాఠశాలలు తల్లిదండ్రుల నుంచి మంచి స్పందనను పొందుతూ, ఎర్లీ చైల్డ్‌హుడ్ విద్యకు పునాదులు వేయడంలో సహాయపడుతున్నాయి.ఈ పాఠశాలలతో పూర్వ ప్రాథమిక మరియు ప్రాథమిక తరగతుల్లో విద్యార్థుల హాజరు పెరిగింది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం స్థానిక సంస్థల పరిధిలో 1,000 పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక సెక్షన్లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఒక్కో పాఠశాలకు సమగ్రశిక్ష ద్వారా మానవ వనరుల కోసం రూ.2 లక్షలు, పిల్లలకు అవసరమైన పరికరాల కొనుగోలుకు మరొక రూ.1 లక్ష కేటాయించేందుకు మంత్రిమండలి అనుమతించింది. ఈ మొత్తం ఖర్చు రూ.32 కోట్లు అవుతుందని ప్రభుత్వం గుర్తించింది.రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎర్త్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణకు దివంగత మాజీ ప్రధాని డాక్టర్. మన్మోహన్‌సింగ్ పేరును పెట్టాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఈ మేరకు "డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ" అనే పేరుతో బిల్లును ఆమోదించింది. ఈ నిర్ణయాలు రాష్ట్రంలో విద్యా రంగ అభివృద్ధికి కొత్త దిశలో దోహదపడనున్నాయి.

# బంగారం ధరలకు కళ్లెమెప్పుడు

**దేశీయంగా బంగారు ఆభరణాలకు డిమాండ్ లేకపోయినప్పటికీ బంగారం ధర ఎందుకు పెరుగుతుందా అనే సందేహం కలగవచ్చు. నిజానికి బంగారం ధర పెరగడానికి ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్లే కారణమని చెప్పవచ్చు.**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రపంచ దేశాల పైన సుంకాల పేరుతో అన్ని దేశాల పైన పన్ను బాదుడు మొదలుపెట్టారు.బంగారం ధర ప్రతిరోజు భారీగా పెరుగుతోంది. అడ్డు అదుపు లేకుండా పసిడి ధరలు పెరగడానికి ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్లో పరిస్థితులే కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. ఓవైపు భారీగా పెరిగిన ధరల నేపథ్యంలో పసిడి ఆభరణాలు కొనుగోలు చేసేందుకు జనాలు షాపులకు రావడం లేదు. మరోవైపు తయారీదారులకు కూడా భారీగా పెరిగిన పసిడి ధరలతో ఆభరణాలు తయారు చేయాలంటే కూడా 24 క్యారెట్ల గోల్డ్ బిస్కెట్లను కొనుగోలు చేయడానికి పెద్ద ఎత్తున ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు మార్కెట్లో ఆశించినంత సేల్స్ లేకపోవడంతో పసిడి వ్యాపారులు సైతం పెద్ద ఎత్తున నష్టపోతున్నారని చెప్పవచ్చు. పెరుగుతున్న ధరల వల్ల అటు కస్టమర్లు, అలాగే మరోవైపు బంగారు ఆభరణాల తయారీదారులు సైతం నష్టపోతున్నారు. డిమాండ్ తగ్గిపోవడంతో పాటు, ముడి బంగారం ధర భారీగా పెరిగిపోవడం వల్ల అటు తయారీ దారులకు కూడా పెద్ద ఎత్తున నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే అటు దేశీయంగా బంగారు ఆభరణాలకు డిమాండ్ లేకపోయినప్పటికీ బంగారం ధర ఎందుకు పెరుగుతుందా అనే సందేహం కలగవచ్చు. నిజానికి బంగారం ధర పెరగడానికి ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్లే కారణమని చెప్పవచ్చు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రపంచ దేశాల పైన సుంకాల పేరుతో అన్ని దేశాల పైన పన్ను బాదుడు మొదలుపెట్టారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యం పెద్ద ఎత్తున దెబ్బతిన్నది అని చెప్పవచ్చు. ఫలితంగా ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్లో తమ పెట్టుబడులను బంగారం వైపు తరలించడం ప్రారంభించారు. సాధారణంగా బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడి సాధనంగా చెబుతుంటారు.అంతర్జాతీయ మార్కెట్లలో ఎప్పుడూ ఒడిదుడుకులు ఏర్పడినప్పటికీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను బంగారం వైపు తరలిస్తుంటారు. దీంతో పసిడి ఆభరణాల డిమాండ్ తో సంబంధం లేకుండా అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ధర పెరగడం ప్రారంభించింది. చైనా సెంట్రల్ బ్యాంకు సైతం పెద్ద ఎత్తున ముడి బంగారం కొనుగోలు చేసిన నేపథ్యంలో బంగారం డిమాండ్ భారీగా పెరిగిపోయి ధరలు కూడా ఒక్కసారిగా ఆకాశాన్ని తాకడం ప్రారంభించాయి. చరిత్రలో ఎప్పుడు లేని విధంగా బంగారం ధర ఒక ఔన్స్ 3000 డాలర్ల నుంచి 4000 డాలర్లకు ఈ ఏడాది పెరిగింది. ఫలితంగా బంగారం ధర దేశీయ మార్కెట్లలో ఏకంగా 24 క్యారెట్ల 10 గ్రాములకు గానూ 1.30 లక్షల రూపాయలకు తాకింది. డాలర్ విలువ పుంజుకోవడం ద్వారా బంగారం విలువ కూడా తగ్గే అవకాశం ఉంటుంది. అమెరికా డాలర్ విలువ పెరగడానికి ట్రంప్ సర్కార్ చర్యలు తీసుకున్నట్లయితే బంగారం ధర కూడా తగ్గే అవకాశం ఉంటుంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లు పెంచినట్లయితే, అమెరికా జారీ చేసే ట్రెజరీ బాండ్ల యీల్డ్స్ రాబడి పెరుగుతుంది అప్పుడు ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను బంగారం వైపు నుంచి తరలించి అమెరికా జారీ చేసే ట్రెజరీ బాండ్ల వైపు పెడతారు. ఫలితంగా బంగారం ధర తగ్గే అవకాశం ఉంటుంది.రాజకీయ అస్థిరత, వాణిజ్య వివాదాలు, భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారం వైపు మొగ్గు చూపుతారు. ఈ స్థాయిలో పెరుగుతున్న గోల్డ్ త్వరలోనే పతనం కానుందని అంటున్నారు,ఈ సంవత్సరం బంగారం ధరలు భారీగా పెరిగాయి. వార్షిక ప్రాతిపదికన బంగారం ధర దాదాపు 61 శాతం పెరిగింది, ఇది షేర్లు, బాండ్లు, ఇతర పెట్టుబడి సాధనాలతో పోలిస్తే పెట్టుబడిదారులకు అత్యధిక రాబడిని అందించే ఎంపికగా నిరూపితమైంది. అయితే, రాబోయే రోజుల్లో ఈ పెరుగుదల కొనసాగుతుందా లేదా బంగారం ధరలు తగ్గుతాయా అనే ప్రశ్న ఇప్పుడు మార్కెట్లో తలెత్తుతోంది. బ్యాంక్ ప్రకారం, వచ్చే ఏడాది బంగారం ధరలు భారీగా పడిపోయే అవకాశం ఉంది. ఈ సంవత్సరం బంగారం రికార్డు స్థాయికి చేరుకోవడానికి ప్రధాన కారణాలు భౌగోళికరాజకీయ ఉద్రిక్తత, ఆర్థిక అనిశ్చితి, డాలర్ బలహీనత, US వడ్డీ రేట్లలో మార్పులుగా భావిస్తున్నారు.స్పాట్ గోల్డ్ ఇప్పటివరకు అత్యధికంగా ఔన్సుకు $4,225.69కి చేరుకుంది, ఆ తర్వాత 0.4 శాతం పెరిగి $4,224.79కి చేరుకుంది. ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి లేదా సంక్షోభం ఏర్పడినప్పుడల్లా, పెట్టుబడిదారులు సురక్షితమైన ఆస్తిగా బంగారంలో పెట్టుబడులు పెంచుతారు. రాయిటర్స్ ద్వారా ఉటంకించిన నివేదిక ప్రకారం, ఈ సంవత్సరం చివరి నాటికి బంగారం ధరలు ఔన్సుకు $4,400 వరకు చేరుకోవచ్చు, అయితే 2026 జూన్ నాటికి ఇది $4,600 చుట్టూ ఉండవచ్చు. అయితే, వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ధరలు భారీగా తగ్గే అవకాశం ఉంది. రాజకీయ అస్థిరత, సుంకాల వివాదాలు, భౌగోళికరాజకీయ ఉద్రిక్తత వంటి కారణాల వల్ల పెట్టుబడిదారులు ఇప్పటికీ బంగారం వైపు ఆకర్షితులవుతారు. 2026 మధ్య నాటికి వెండి ధరలు ఔన్సుకు $57.50కి చేరుకోవచ్చని కూడా నివేదిక అంచనా వేసింది. అయితే, US ఫెడరల్ రిజర్వ్ కఠినంగా వ్యవహరిస్తే లేదా US ఆర్థిక వ్యవస్థ ఊహించిన దానికంటే మెరుగ్గా రాణిస్తే, దీనికి వ్యతిరేక ప్రభావం ఉండవచ్చు. బంగారం ధరలు తగ్గుతాయి.




# మళ్లీ కరీంనగర్ లో వర్గపోరు

**జయభేరి, కరీంనగర్, అక్టోబరు 17:**

కరీంనగర్‌లో కాషాయ కుంపటి - బండి వర్సెస్ ఈటల వర్గపోరు మళ్లీ రగిలింది.హుజురాబాద్ నియోజకవర్గం చుట్టూ కాషాయ రగడ స్థానిక ఎన్నికల్లో బీఫాం ఇష్యూనే రచ్చకు కారణమా..? గతంలో బండిపై పరోక్షంగా ఈటల ఘాటు వ్యాఖ్యలు హుజురాబాద్‌లో ప్రెస్‌మీట్ తర్వాత రాజుకున్న మంటలు తెలంగాణ బీజేపీలో కీలక నేతల మధ్య ఆధిపత్య పోరు మళ్లీ రగులుకుంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ వర్గం.. ఎంపీ ఈటల రాజేందర్ మధ్య విభేదాలు మరోమారు బయటపడ్డాయి. హుజురాబాద్ పార్టీ నేతల విషయంపై మొదలైన వివాదం రోజురోజుకూ మరింత ముదురుతోంది. హుజురాబాద్‌లో ఆధిపత్యాన్ని నిరూపించుకునే ప్రయత్నంలో ఈటల మాటాల తూటాలు పేలుస్తుంటే.. బండి వర్గం అంతే ధీటుగా కౌంటర్ అటాక్ చేస్తోంది. గతంలోనూ ఈటల, బండి మధ్య పేర్లు ప్రస్తావించకుండా డైలాగ్ వార్ నడిచింది. ఓవైపు రిజర్వేషన్ల పంచాయితీ తేలక.. స్థానిక ఎన్నికలు వాయిదా పడగా.. బండి వర్సెస్ ఈటల వర్గాల తాజా పంచాయితీ పొలిటికల్ హీట్ పెంచుతోంది. ఇంతకీ ఆ రెండు వర్గాల మధ్య తాజా పొలిటికల్ పంచ్‌లకు రీజనేంటి.. నిన్న, మొన్నటి వరకు స్థానికంగా ఉండే నాయకుల్లో కనిపించిన విభేదాలు ఇప్పుడు నేరుగా ముఖ్య నాయకుల మాటలతో మరింత రంజుగా మారిపోయాయా..? తాజా పరిణామాలు పరిశీలిస్తే అవుననే సమాధానం వస్తోందంటున్నారు రాజకీయ విశ్లేషకులు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో హుజూరాబాద్ నియోజవర్గంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఇన్నేళ్లుగా హుజూరాబాద్ వైపు కన్నెత్తి చూడని ఈటల రాజేందర్.. ఈమధ్య ఉన్నట్టుండి రావడం.. అందులోనూ బీజేపీ శ్రేణులను, తన అనుచరులను ప్రేమగా పలకరించడం హాట్‌టాపిక్‌గా మారింది. ఈటల హుజూరాబాద్ నుంచి మల్కాజిగిరి మకాం మార్చడంతో.. ఆయన ఫాలోయర్స్.. అయోమయంలో పడ్డారు. కారు దిగిన ఆయన కమలదళంలో చేరడంతో.. అప్పటి వరకు ఉన్న అనుచరులకు బీజేపీలో అంతగా ప్రాధాన్యత లేదన్న వాదన లేకపోలేదు. ఈటల మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలిచారు సరే.. మా సంగతేంటంటూ ఆయన అనుచరులు ఆవేదన చెందుతున్నారట. ఈటల హుజురాబాద్ రారు.. ఇక్కడి బీజేపీ నాయకులు తమను కలుపుకుని పోరు.. అంటూ వాపోతున్నారట. ఈ నేపథ్యంలో తనను నమ్ముకున్న కేడర్‌కు భరోసా ఇచ్చేందుకు ఈటల తాజాగా హుజురాబాద్ బాట పట్టారు. వరుస పర్యటనలు చేస్తూ అనుచరులకు నేనున్నానంటూ అభయం ఇస్తున్నారు.. తన అనుచరులకు భరోసా ఇవ్వడం అంతా బాగానే ఉన్నా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో హుజూరాబాద్ బీజేపీ అభ్యర్థులకు బీఫామ్స్ నేనే ఇస్తానంటూ ఈటల చేసిన కామెంట్ ఇప్పుడు అగ్గికి ఆజ్యం పోసినట్టయ్యిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అసలే బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య కోల్డ్ వార్ కంటిన్యూ అవుతోందన్న ప్రచారం ఉంది. అలాంటిది ఇప్పుడు ఏకంగా బండి సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ సెగ్మెంట్‌కే వచ్చి.. కరీంనగర్ పార్లమెంట్‌లోఉండే హుజూరాబాద్‌లో పార్టీ బీఫామ్స్ నేనే ఇస్తానంటూ ఈటల అనడం రచ్చగా మారిపోయిందట. పైగా ఆ మాటలన్న ఈటలను.. బండి సంజయ్ ఈపాటికే సర్వే చేయించారు కదా.. అని జర్నలిస్టులు అడిగితే.." నేనిక్కడ ఇరవై ఐదేళ్ల నుంచి లీడర్‌ని.." అంటూ బండికి తన మార్క్ కౌంటర్ వేశారు. ఈ వ్యాఖ్యలే ఇప్పుడు కరీంనగర్ బీజేపీలో కొత్త పంచాయితీకి తెరలేపిందన్న చర్చ జోరందుకుంది ఈటల కామెంట్స్‌కు బండి సంజయ్ వర్గం నుంచి కౌంటర్ అటాక్ కూడా వచ్చిందట."బీఫాంలు ఇచ్చేది వ్యక్తులు కాదు.. బీజేపీ అధిష్టానం" అని స్పష్టం చేస్తోందట బండి వర్గం. గ్రూపులు కట్టి, వర్గాలు విడిపోయేవారి మాట వినే సాంప్రదాయం బీజేపీలో లేదంటూ కూడా కుండబద్దలు కొట్టారు. నిజానికి హై కోర్ట్ స్టేతో స్థానిక సంస్థల ఎన్నికలు ఆగిపోయాయి. ఆ తరవాత హుజురబాద్‌లో ఈటల చేసిన ఈ వ్యాఖ్యలు ఇలా దుమారం రేపుతున్నాయి. అంతా సిద్ధమైనప్పటికీ.. ఎన్నికలు ఆగిపోవడంతో స్థానిక నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో తాజాగా బండి వర్సెస్ ఈటల వర్గాల పంచాయితీ.. కరీంనగర్ జిల్లాలో కొత్త పొలిటికల్ హీట్ పెంచిందటవచ్చే ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో.. ఎవరు ఓడుతారో..? అనే అంశం కంటే .. ఈటల వర్గానికి బీఫాములు వస్తాయా..? లేదంటే బండి సంజయ్ వర్గానికి దక్కుతాయా..? అనే ఆసక్తికర చర్చ మొదలైంది. ఎన్నికల హడావుడికి ప్రస్తుతం బ్రేక్ పడినప్పటికీ, ఈ రెండు వర్గాల మధ్య మొదలైన రగడ.. మరింత హీట్ పెంచుతోందట. మరి హుజూరాబాద్‌లో బీజేపీ టికెట్లు తమ వారికి ఇప్పించుకుని ఈటల పైచేయి సాధిస్తారా..? లేదంటే పార్టీ కోసం పని చేసినవారికి టికెట్లు అంటూ చెబుతున్న సంజయ్ వర్గం.. పైచేయి సాధిస్తుందా..? అనేది చూడాలి. అసలు స్థానిక సంస్థల ఎన్నికల కంటే బండి వర్సెస్ ఈటల వర్గాల అంశమే ఇప్పుడు కరీంనగర్ జిల్లాలో హాట్ టాపిక్‌గా మారిందట.







## బిల్లు పెట్టకుండా అడ్డుపడుతున్నదెవరో తేలాలి

■ **డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క**

**జయభేరి, ఖమ్మం అక్టోబర్ 17:**

తొలిసారిగా సైంటిఫిక్ గా కులగణన నిర్వహించామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రతిపక్షాలు చేస్తున్న పనులన్నీ బిసిలు చూస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సర్వే ద్వారా వచ్చిన సమాచారంతో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చూశామని, అఖిల పక్షాలను తీసుకెళ్లాలని బిజెపిని కోరుతున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు కూడా ముందుకు రావాలని కోరారు. రేపటి బంద్ లో కాంగ్రెస్ శ్రేణులంతా పాల్గొనాలని, బిల్లు పెడితే మద్దతిస్తామని తమ అగ్రనేతలంతా ఇప్పటికే స్పష్టం చేశారని తెలియజేశారు. బిసి రిజర్వేషన్ల బిల్లుకు అడ్డుపడుతున్న బిజెపికి వ్యతిరేకంగా అందరూ పాల్గొనాలని సూచించారు. పార్లమెంటులో బిల్లు పెట్టకుండా అడ్డుపడుతున్నదెవరో తేలాలని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సహా అందరం వచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. సుప్రీంకోర్టు తీర్పుపై న్యాయనిపుణులతో చర్చిస్తామని అన్నారు. అఖిలపక్షంతో ప్రధాని నరేంద్ర మోడీని కలవాలనుకున్నామని, మోడీ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# బీసీల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

- బీసీ రిజర్వేషన్ ను బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అడ్డుకుంటున్నాయి
- బీసీ బంద్ కు సంపూర్ణ మద్దతు
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 17 :**



బీసీల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది. తెలంగాణలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అనేది న్యాయ బద్ధమైన కోరిక అని బీసీల బతుకుల్లో వెలుగులు నింపాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీదనీ అయితే వీటిని లోపకారిగా అడ్డుకునే ప్రయత్నంలో బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర పన్నుతున్నాయని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శించారు. శుక్రవారం షాద్ నగర్ ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తోపాటు బీసీ సేన నాయకులు, అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ విభాగం నాయకులు పెద్ద ఎత్తున మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. రేపు బిసి ప్రజల ఆకాంక్ష మేరకు చేపట్టబోయే బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలువురు బీసీ సంఘాలకు ప్రజలకు పిలుపునిచ్చారు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని ప్రభుత్వం దీనికి ఎన్నో వెసులుబాట్లు కల్పిస్తూ బిల్లును ఆమోదించిందని కాకపోతే కేంద్రంలో ఉన్న బిజెపి సర్కార్ దీనిని అడ్డుకుంటుందని ఆరోపించారు. బాధ్యతగా ఉండాల్సిన ప్రతిపక్ష హోదాలో టిఆర్ఎస్ కూడా లోపకారిగా కుట్ర చేస్తుందని ఆరోపించారు. బీసీల రిజర్వేషన్లపై రాజీపడేప్రసక్తే లేదన్నారు. 42% బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని తేల్చిచెప్పారు.

బీసీ రిజర్వేషన్లకు రాజకీయాలతో సంబంధం లేదని, ఇది యావత్ తెలంగాణలోని బీసీల సమస్య అని తెలిపారు. బీసీల బతుకుల్లో వెలుగులు నింపాలనే చిత్తశుద్ధితో కాంగ్రెస్ పనిచేస్తోందని, అడ్డుకునే ప్రయత్నంలో బీజేపీ, బీఆర్ఎస్ ఉన్నాయని మండిపడ్డారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతిచ్చిన పార్టీలు కేంద్రంలో, న్యాయస్థానాల్లో ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నించారు. బీసీలకు 42% రిజర్వేషన్లను అడ్డుకోవడమే బీజేపీ, బీఆర్ఎస్ అంతర్గత ఉమ్మడి అజెండా అని ఆరోపించారు.

ఎవరెన్ని కుట్రలు చేసినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో బీసీ రిజర్వేషన్లు అమలు చేసి తీరతామని చెప్పారు. పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని హైకోర్టు చెప్పడం ఎంతో బాధ కలిగించిందన్నారు.

ఈ న్యాయ సంబంధమైన విషయాలను ప్రభుత్వం చూసుకుంటుందని పేర్కొన్నారు. బీసీల చిరకాల కోరికను తీర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బీసీ బంద్ కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు అయన స్పష్టం చేశారు.



## బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే

- బీసీల బంద్ కు సంపూర్ణ మద్దతు తెలిపిన లంబాడి హక్కుల పోరాట సమితి కేశం పేట మండల అధ్యక్షుల జరుపుల రాజు నాయక్

**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 17 :**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని లంబాడి హక్కుల పోరాట సమితి కేశంపేట మండల అధ్యక్షులు జనసేన పార్టీ సీనియర్ నాయకులు జరుపుల రాజు నాయక్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధనకై 18న బీసీల ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీల బంద్ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ;బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కేల అందరూ ఐక్యతతో బీసీలకు మద్దతు ఇవ్వాలని అన్నారు. సంఖ్యాపరంగా బీసీలకు స్థానిక సంస్థల్లో, ఉద్యోగ అవకాశాల్లోనూ వారికి పూర్తిస్థాయి న్యాయం జరుగుతుందని అన్నారు. బీసీ లందరికీ ప్రతి ఒక్కరు మద్దతు తెలిపి 42 శాతం రిజర్వేషన్ ఖరారు అయ్యేటట్లు అండగా ఉండాలని, ఈనెల 18న జరిగేటువంటి బీసీ బందుకు ప్రతి ఒక్కరూ బీసీలకు మద్దతు తెలిపి ఐక్యతను చాటి చెప్పాలని అన్నారు. బీసీ బందుతో కేంద్ర స్థాయి వరకు బీసీ రిజర్వేషన్ సమస్య తక్షణ పరిష్కారం అయ్యేవరకు అందరం అండగా ఉండాలని ఆయన అన్నారు. బీసీల న్యాయపోరాటంకు లంబాడి హక్కుల పోరాట సమితి పూర్తిస్థాయిలో మద్దతు తెలుపుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- బొచ్చు కళ్యాణ్ సిపిఎం పార్టీ పరకాల పట్టణ కార్యదర్శి



**జయభేరి, పరకాల, అక్టోబర్ 17:**

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా అక్రమ అరెస్టు చేసిన సిపిఎం నాయకులను వెంటనే విడుదల చేయాలని సిపిఎం పరకాల పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ అన్నారు నేడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేస్తూ చలో రాజ్ భవన్ ముట్టడికి సిపిఎం పిలుపు ఇచ్చిన సందర్భంగా పరకాల, హనుమకొండ జిల్లా వ్యాప్తంగా అరెస్ట్ చేసిన సిపిఎం నాయకులువెంటనే విడుదల చేయాలన్నారు లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని,హెచ్చరించారు.

# గులాబీ పార్టీ ఘనవిజం సాధించాలి

- మాగంటి సునీతను భారీ మెజారిటీతో గెలిపించండి
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి

**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 17 :**




జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా మాగంటి సునీత గెలుపు కొరకు సోమాజిగూడ డివిజన్లోని పోలింగ్ బూత్ 277 , 279 లో అంబేద్కర్ నగర్లో మైనార్టీ ఓటర్లను కలిసి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి మాగంటి సునీతమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నవీన్ రెడ్డి ఓటర్లతో మాట్లాడుతూ; కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు అబద్దాల హామీలు అని అన్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల కాలం పూర్తవుతున్న హామీలఅమలు లేదు! అని ప్రశ్నించారు? కాంగ్రెస్ పార్టీ పై ప్రజలు తీవ్ర అసంత్రుప్తితో ఉన్నారని కాంగ్రెస్ ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తిరిగి రావాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని అందులో బాగంగా జూబ్లీ హిల్స్ బిఆర్ఎస్ ఉప ఎన్నికల్లో మాగంటి సునీత. ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు ఇన్చార్జిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వైద్య వ్యవస్థను పటిష్టం చేయాలి

- డాక్టర్ భూక్యా రవి రాథోడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

**జయభేరి, గార్ల, అక్టోబర్ 17:**



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజా వైద్య వ్యవస్థను పటిష్టం చేయాలని మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భూక్యా రవి రాథోడ్ సూచించారు. శుక్రవారం ఐడిఓసి లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో 21ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్ లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిపాలనపై సమావేశం



నిర్వహించారు.ఈ సందర్భంగా రవి రాథోడ్ మాట్లాడుతూ, ఫైలు పెండింగ్లో ఉండకుండా ఎప్పటికప్పుడు ఉద్యోగులు ప్రోగ్రాం ల బిల్లులను చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాల అమలు అన్నింటిని ఆన్లైన్లో అప్డేట్ చేయాలని అన్నారు. ఉద్యోగులందరూ సమన్వయంతో వీధులు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలో ప్రజల ఆరోగ్య సమస్యలను నివృత్తి చేస్తూ ప్రజల మధ్య ఉండే విధంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సీనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బల్క్ డ్రగ్స్ పార్కు ఏర్పాటును రద్దు చేయాలి

- రాజయ్యపేట మత్స్యకారులపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించండి
- సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి డిమాండ్

**జయభేరి, పరవాడ :**



అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో బల్క్ డ్రగ్స్ పార్కు వద్దు గంగమ్మతల్లి ముద్దు అంటూ గత నెల రోజులుగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నారు.ఈ పోరాటాన్ని అణచివేయాలనే కుట్రపూరితంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వం తీవ్రంగా నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. దీనిని నిరసిస్తూ శుక్రవారం పరవాడ మండలం ముత్యాలంపాలెం గ్రామంలో సిఐటియు, మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉద్యమ పోస్టరు ఆవిష్కరించడమైనది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రాజయ్యపేటలో నెలల తరబడి సెక్షన్30ని అమలు చేస్తున్నారు. పోలీసు పికెట్లు పెట్టి ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పోరాటానికి మద్దతు తెలుపుతున్న సిపిఎం నాయకులను గృహనిర్బంధంలో నిర్బందిస్తున్నారని అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆధార్ కార్డు చూసి గ్రామంలోకి అనుమతిస్తున్నారని బయట వ్యక్తులను ఎవ్వరినీ గ్రామంలోని అనుమతించడం లేదని ప్రభుత్వం ఆగకుండా నిర్మాణ పనులు చేస్తున్నది. ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా నిర్మాణ పనులు ఎలా చేస్తారని అడుగుతున్న మత్స్యకారులపై పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారు. భారీ సంఖ్యలో పోలీసులను మోహరించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రాజ్యాంగం ఆర్టికల్21 ప్రకారం ప్రజలు జీవించే హక్కును కాలరాసే విధంగా ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గంని ఇప్పటికైనా ప్రభుత్వం పోలీసు నిర్బంధాన్ని ఎత్తివేయాలని, ప్రజాభిష్టం మేరకు బల్క్ డ్రగ్స్ పార్కు ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం నాయకులు బి బంగారి, సొరడ రామ్మూర్తి, రాజీ అమ్మ, పోచమ్మ కోవిరి రావులమ్మ తదితరులు పాల్గొన్నారు.



## బీసీ జేఏసీ బంద్ కు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు

- ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు వడ్ల శ్రీకాంత్
- ఈ నెల18వ తేదీన తెలంగాణ బంద్ ను విజయవంతం చేద్దాం

**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 17 :**

స్థానిక సంస్థల ఎన్నికలలో చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను విధిగా నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ; బీసీ జేఏసీల పిలుపు మేరకు 18న రాష్ట్ర వ్యాప్త బంద్ కార్యక్రమానికి అన్ని కుల సంఘాలతో పాటు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు.అన్ని విద్యా సంస్థలు, కిరణం షాప్ లు, బస్సులు, ఆటోలు అన్ని ప్రైవేటు వాహనాలు, వాణిజ్య సంస్థలు, హోటళ్ళు సినిమా హాల్ లు పెట్రోల్ పంపు లు బంద్ ను పాటించాలి విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా బంద్ కు మద్దతు తెలపాలని షాద్ నగర్ తాలూకాలో బంధును సంపూర్ణంగా పాటించి విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు శ్రీకాంత్ కోరారు.

## బిసి జెఎసి బంద్ కు సంపూర్ణ మద్దతు



- ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం
- బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు వ్యతిరేకంగా ఉన్న బీజేపీని గద్దె దింపాలి
- ఎం. పవన్ చౌహాన్ ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 17 :**

బిసి రిజర్వేషన్ల సాధనకు వివిధ బిసి సంఘాలతో ఏర్పడిన బిసి ఐక్య కార్యాచరణ కమిటీ (బిసి జెఏసి) బంద్ ఫర్ జస్టిస్ పేరుతో అక్టోబర్ 18న చేపట్టే రాష్ట్ర బంద్ కు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని, బంద్ లో ప్రత్యక్షంగా షాద్ నగర్ నియోజకవర్గం వ్యాప్తంగా పాల్గొంటామని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ చౌహాన్ మట్లాడుతూ.. బిసి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు. బిసి బిల్లులను ఆమోదించి, రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైన ఉందని స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మీద నిన్న హైకోర్టు స్టే విధించడంతో, రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి. దీనికి ప్రధాన కారణం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని. ఇప్పటికైనా రాష్ట్రం నుండి ప్రాతినిథ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించి, వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అందరూ బీసీ బంద్ కు మద్దతు తెలిపి ఐక్యతను చాటి చెప్పాలని అన్నారు.

## బీసీలకు 42%రిజర్వేషన్ కోరుతూ రాజ్ భవన్ ముట్టడి

- రాష్ట బంద్ ను జయప్రదం చేయండి.. సీపీఎం పార్టీ




**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 17 :**

జనాభాలో సగం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్లోనీ రాజ్ భవన్ ముట్టడి సందర్భగా షాద్ నగర్ నుండి సిపిఎం పార్టీ నాయకులు ఎన్. రాజు ,ఈశ్వర్ ,శ్రీను నాయక్ ,గోపాల్, బయలుదేరడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి ఎన్ రాజు మాట్లాడుతూ; బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి భారత రాజ్యాంగంలోని షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి ఆర్డినేన్స్ ను గవర్నర్ కు పంపడం జరిగిందని కానీ నేటి వరకు గవర్నర్ అట్టి ఫైల్ పై సంతకం చేయడం లేదని ఉద్దేశపూర్వకంగా బీసీలకు అన్యాయం చేయాలనే బిజెపి కుట్రలో భాగంగానే ఇక్కడున్న గవర్నర్ సంతకం చేయడం లేదని వారు వాపోయారు. అదేరకంగా భారత ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ పై చర్చ చెరిపి భారత రాజ్యాంగంలోని షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ విగ్రహం ధ్వంసం

**జయభేరి, మేడ్చల్:**

మేడ్చల్ జిల్లా కీసర సీఎస్ పరిధిలో రాంపల్లి వద్ద హనుమాన్ విగ్రహం ధ్వంసం చేశారు. గురువారం రాత్రి హనుమాన్ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. హనుమాన్ విగ్రహం ఎడుమ చేయితో పాటు గదను ధ్వంసం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న కీసర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చుట్టుపక్కల సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నారు.

# కొండా పదవికి ఎసరు

✍ జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 17:



కొండా సురేఖ మంత్రిపదవికి ఎసరు వచ్చింది. ఆమెను తప్పించేందుకు రంగం సిద్ధమైనట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి, మంత్రులపై ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలతోపాటు కొండ సురేఖ కూడా సన్నిహితుల వద్ద ఇలాంటి కామెంట్స్ చేసినట్టు తెలుస్తోంది. అంతే కాకుండా మొదటి నుంచి ఆమె వివాదాల్లో ఇరుక్కోవడం తర్వాత ప్రభుత్వం వాటిని సమర్థించుకోవడం సాధారణంగా మారింది. ఇప్పటి వరకు ఎక్కువ వివాదాల్లో ఇరుక్కున్న మంత్రిగా కొండా సురేఖ పేరు పొందారు. కేటీఆర్, నాగార్జున ఫ్యామిలీ ఇష్యూలపై మాట్లాడటం, తర్వాత ఓ ప్రైవేటు పార్టీలో మందు గురించి మాట్లాడటం, తోటి మంత్రులతో గిల్లికజ్జాలు, ఇలా వివిధ రకాలైన వివాదాల్లో ఇరుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు వెలుగు చూసిన వివాదం మరింత రచ్చకెక్కింది. ఏకంగా ఓ కంపెనీ ప్రతినిధులను గన్‌తో బెదిరించిన వ్యక్తికి వంతపాడుతూ కాపాడే ప్రయత్నం చేయడంతో ముఖ్యమంత్రి సీరియస్‌గా ఉన్నట్టు తెలుస్తోంది. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారు. మొదటి నుంచి వివాదాల మంత్రిగా ఉన్న కొండా సురేఖపై మొత్తం మంత్రిమండలే గుర్రుగా ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే దీనిపై అధినాయకత్వానికి ఫిర్యాదు చేసి తప్పించాలని చూస్తున్నారు. బుధవారం నుంచి ఓఎస్‌డీ చుట్టూ రాజుకున్న వివాదంలో ఆమె కుమార్తె చేసిన కామెంట్స్ మరింత కాక రేపాయి. ఏకంగా టెండర్ల పేర్లతో, సెటిల్మెంట్ల పేర్లతో దోపిడీ జరుగుతుంది అని సిట్టింగ్ మినిస్టర్ కూతురే కామెంట్స్ చేయడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. సీఎం అనుచరుడు రోహిణ్ రెడ్డి దందాలు చేస్తున్నారని, సీఎం బ్రదర్స్ కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి గురించి, రేవంత్ అంతర్గత విషయాలపై సుస్మిత బహిరంగంగా మీడియా ముందు విమర్శలు చేశారు. వీటన్నింటిపై గుర్రుగా ముఖ్యమంత్రి ఇంకా కొండా సురేఖను కొనసాగిస్తే వాటికి సమ్మతించినట్టు అవుతుందని భావిస్తున్నారట. అందుకే ఆమెను తప్పించేందుకు సిద్ధమయ్యారని అంటున్నారు. మేడారం పనుల టెండర్లతో మొదలైన వివాదం ఇప్పుడు మరింత పీక్స్ వెళ్లింది. అప్పటి నుంచి ముఖ్యమంత్రి మీటింగ్స్‌కు కొండా సురేఖ దూరంగా ఉంటున్నారు. ఇవాళ కేబినెట్‌కు వస్తారో రారో కూడా తెలియడం లేదు. అందుకే ఇంత గ్యాప్ వచ్చిన తర్వాత టీంగా పని చేయడం కష్టమని సీఎం సన్నిహితులు చెబుతున్నారు. కొండా సురేఖను తప్పించేందుకు అధిష్ఠానం ఓకే చెబుతుందా లేదా అన్నది మాత్రం అనుమానంగా ఉంది. అసలే బీసీల కోసం పోరాడుతున్న పార్టీగా ఎస్టాబ్లిష్ అవుతున్నారు. ఈ టైంలో ఓ బీసీ మహిళను తప్పిస్తే ఎలాంటి పరిణామాలు ఉంటాయనేది బేరీజు వేసుకుంటున్నారు. దీనికి కౌంటర్‌గా ఏం చేయాలనే విషయంపై చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. అసలే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు, మరోవైపు లోకల్ బాడీ ఎన్నికల వేళ కొండా సురేఖపై తీసుకునే నిర్ణయం పార్టీకి ఇబ్బంది లేకుండా ఏం చేయాలో ఆలోచిస్తున్నారు. అసలే కోర్టు వివాదాలతో బీసీ సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు నిరసనలు చేపడుతున్నారు. ఈ టైంలో ఈ నిర్ణయం తీసుకుంటే వచ్చే పరిణామాలపై సమాలోచనలు జరుపుతున్నారు. సురేఖతో పార్టీ పెద్దలు మాట్లాడి ఆమెకు స్వతహాగా తప్పుకునేలా కూడా ఒప్పించే ఛాన్స్ ఉందని అంటున్నారు. తనపై తన అనుచరులపై ఆరోపణలు వచ్చినందుకు అవి నిర్ధారణ అయ్యే వరకు పదవికి దూరంగా ఉంటానని చెప్పే ఆస్కారం లేకపోలేదని, దీని వల్ల రెండు వర్గాలను కూల్ చేసినట్టు అవుతుందని కూడా పార్టీలోని ఓ వర్గం ప్రయత్నాలు చేస్తోంది.



## సిపిఆర్ పై అవగాహన సదస్సు

✍ జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 17:

తుర్కపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం డాక్టర్ కె విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సి పి ఆర్ పై అవగాహన సదస్సును నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో అనగా యాక్సిడెంట్ లో కానీ, ఆర్ట్ ఎటాక్ సమయంలో హృదయ స్పందన ఆగిన, పల్స్ చూసి ఆగిన కొద్ది క్షణాల్లో సిపిఆర్ విధానం చేస్తూ, అత్యవసర సేవల కోసం 108 వాహనానికి కాల్ చేయమని చెప్పి రెండు నిమిషాల్లో 30 సార్లు చాతిని వేగంగా నొక్కి రెండుసార్లు నోటిపై నోరు పెట్టి మధ్యలో దస్తి పెట్టి గట్టిగా గాలిని ఊదుతూ రెండు నిమిషాల్లో ఐదు సార్లు చేస్తూ ఎడమ పక్కకు మలిపి నాడి స్పందనను పరీక్షిస్తూ నాడీ కొట్టుకునే వరకు మళ్ళీమళ్లీ 20 నిమిషాల వరకు చేస్తూనే ఉండాలని అన్నారు. ఇలా చేస్తే మనిషి బతికే అవకాశం ఉందని తెలిపారు. హెల్త్ సిబ్బంది, ఆశా వర్కర్లకు, ఐసిడిఎస్ అంగన్వాడీ టీచర్లకు, పంచాయతీరాజ్ సిబ్బందికి, పోలీసు సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ రుచిరా రెడ్డి ,ఎంపఓ వెంకటేశ్వర్లు, ఎస్సై పక్యుద్దీన్, ఎం.ఎల్.హెచ్.పి డాక్టర్లు రాహుల్ కుమార్ గౌడ్, రాహుల్, సూర్య ప్రకాష్ ,నిర్మల, సిహెచ్ఓ రాజయ్య, పి హెచ్ ఎన్ బిస్మిల్లాబి, హెచ్.వి దయామని, ఏఎన్ఎంలు సుహాసిని, పద్మ, అలివేలు, భాగ్యలక్ష్మి, సంధ్యారాణి, కరీంబి, హెల్త్ అసిస్టెంట్లు జానీ పాషా, సునీల్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్టలో బంద్‌ను సక్సెస్ చేయాలి



✍ జయభేరి, యాదగిరిగుట్ట, అక్టోబర్ 17:

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు ఈ నెల 18న చేపట్టనున్న యాదగిరిగుట్టలో బంద్‌ను సక్సెస్ చేయాలని బీసీ జేఏసీ, వివిధ రాజకీయ పార్టీలు నాయకులు కోరారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర బంద్ కు అన్ని సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు మద్దతు తెలుపుతున్నాయన్నారు. యాదగిరిగుట్టలో ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలు, ఆర్టీసీ బస్సులు, ఇతర వ్యాపార సంస్థలు మూసివేసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నేతలు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు బందారపు బిక్షపతి, కర్రె ప్రవీణ్, కాదూరి అచ్చయ్య, ముఖ్యర్ల మల్లేష్, ఎరుకల హేమందర్ గౌడ్, పెల్లిమెలి శ్రీధర్, కాట బత్తిని ఆంజనేయులు, మచ్చ నరసింహ, మిట్ట వీరేష్, బొజ్జ సాంబేష్,పేరబోయిన మహేష్, పల్లపు బాలయ్య, అనంతుల నర్సింహా, రాజు తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరీశుని సేవలో గొంగిడి దంపతులు



✍ జయభేరి, యాదగిరిగుట్ట, అక్టోబర్ 17:

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్,బీఆర్ఎస్ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్ రెడ్డి దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి సాంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో శ్రీస్వామి అమ్మవార్లు దర్శించుకుని, వచ్చే నెల నవంబర్ 7వ తేదీన గొంగిడి సునీత మహేందర్ రెడ్డి రెండవ కుమార్తె హర్షిత వివాహం నిహాంత్ తో జరగనున్న నేపథ్యంలో శ్రీస్వామి వారి పాదాల వద్ద మొదటి పత్రికను పెట్టి పూజలు నిర్వహించారు. శ్రీ స్వామివారిని దర్శించుకున్న గొంగిడి దంపతులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా.. ప్రోటోకాల్ అధికారి రాజన్ బాబు శ్రీ స్వామివారి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కర్రె వెంకటయ్య,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్ ఉన్నారు.

## పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులు



✍ జయభేరి, యాదగిరిగుట్ట, అక్టోబర్ 17:

యాదగిరిగుట్ట పట్టణ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూరగాయల కృష్ణ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న వెంటనే ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తదితర కాంగ్రెస్ నాయకులు ఆయన నివాస గృహానికి వెళ్లారు. ఆయన పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శోకార్తులైన కూరగాయల కృష్ణ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎరుకల హేమేందర్, గుండ్లపల్లి భరత్, ముఖ్యర్ల మల్లేష్, బంధారపు బిక్షపతి, వంగపల్లి అరుణ్ తదితర కాంగ్రెస్ పట్టణ, మండల, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి, పాల్వాయి శ్రవణ్ కుమార్

✍ జయభేరి, దేవరకొండ :



పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం దేవరకొండ రెవెన్యూ పరిధిలో ఉన్న పత్తి పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం దేవరకొండ సహాయ వ్యవసాయక సంచాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తి రైతు తాను పండించిన పంట వివరాలను కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలని,ఈ యాప్‌ను ప్లే స్టోర్ నుండి ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, ఎలా పంట వివరాలు నమోదు చేయాలో స్వయంగా రైతులకు చూపించారు. రైతులే స్వయంగా సిసిఐకి తమ పత్తి పంటను అమ్మి మద్దతు ధర పొందవచ్చు అని తెలిపారు. ఒకవేళ సరైన మొబైల్ నెంబర్ లేకపోతే ఏఈఓను సంప్రదించి సరైన నంబర్‌ను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రవికుమార్, ఏఈఓలు అభిలాష్, బాలాజీ, నీలిమ తదితరులు పాల్గొన్నారు.



## కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ముందస్తు దీపావళి వేడుకలు

✍ జయభేరి, దేవరకొండ :



దేవరకొండ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ సిమర్ల రాజ్ కుమార్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులకు క్రాకర్స్, మిఠాయిలు పంచిపెట్టారు. దేశమంతట ఈ పండుగను జరుపుకోవడం గర్వించదగ్గ విషయమని అన్నారు. విద్యార్థులకు పండుగ గురించి తెలవడానికి ప్రతి సంవత్సరం ముందస్తు వేడుకలు జరుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నవీన్ గౌడ్, వైస్ ప్రిన్సిపల్ మొహమ్మద్ అన్వర్ హుస్సేన్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## పశువుల సంత స్థలం దేవస్థానానిదే

- హర్షం వ్యక్తం చేసిన గందే వెంకన్న

✍ జయభేరి, పరకాల, అక్టోబర్ 17:

ప్రముఖ శైవక్షేత్రం శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానమునకు సంక్రమించిన స్థలము దేవస్థానమునకు ప్రక్కనే సర్వేనెంబరు 991, 4ఎకరముల 11 గుంటల స్థలం ఉంది. ఇట్టి స్థలాన్ని అర్చకులు, భక్తులు, నాయకులు దేవాదాయశాఖ కలిసి 1982 నుండి ఉన్నత న్యాయస్థానం హైకోర్టును ఆశ్రయించిగా రికార్డులను పరిశీలించి గత 6నెలల క్రితం అప్పటి వరకు జరిగిన వాదోపవాదములను పునః పరిశీలించి న్యాయం వెలువరించాలని అడిషనల్ కలెక్టర్ హనుమకొండని ఆదేశించారు. హైకోర్టు ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టర్ హనుమకొండ పలు దఫాలుగా విచారణ జరిపి రికార్డులన్నింటినీ పరిశీలించి ఈ స్థలం శ్రీకుంకుమేశ్వర స్వామి వారిదేనని తీర్పు ఇవ్వడము జరిగింది. 2006 నుండి పరకాల మున్సిపాలిటీ వారు దేవస్థానము వారి నుండి స్థలాన్ని లీజు తీసుకొని పశువుల సంత నిర్వహిస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో దేవస్థానం చైర్మన్గా వ్యవహరించిన గందే వెంకటేశ్వర్లు కుంకుమేశ్వర స్వామికి సంబంధించిన నాలుగు ఎకరాల భూమి వ్యవహారంపై పలుసార్లు ప్రస్తావిస్తూ దేవదాయ శాఖకి ఫిర్యాదులు అందిస్తూ దేవస్థానం భూమిలో పరకాల మున్సిపాలిటీ వారు టెండర్ల ద్వారా పశువుల సంతను నడుపు విషయం గురించి నోటీసులు జారీ చేయడం జరిగింది. ఎట్టకేలకు నేటితో కుంకుమేశ్వర స్వామి దేవస్థానంకు చెందినదిగా తీర్పు రావడంతో పరకాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ గందే వెంకన్న హర్షం వ్యక్తం చేసారు.







## బీసీ జేఏసీ బంద్ ను విజయవంతం చేయండి

- గాజుల నిరంజన్, బిజెపి పట్టణ అధ్యక్షులు

✍ జయభేరి, పరకాల, అక్టోబర్ 17:

బీసీలకు న్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రేపు అక్టోబర్ 18న బీసీ జేఏసీ పిలుపునిచ్చిన బంద్ కు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పిలుపు మేరకు పరకాల మండల కేంద్రంలో సంపూర్ణ మద్దతిస్తుంది. ఈ బంద్ లో వ్యాపారస్తులు, విద్యావంతులు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరుచున్నాను. బీసీలకు న్యాయం చేసిందే బిజెపి. బీసీ ప్రధాని, బీసీ ఉపరాష్ట్రపతి, 27 మంది బీసీలను మంత్రులను చేసింది బిజెపి. బీసీ కమిషన్ కు రాజ్యాంగబద్ధ హోదా కల్పించింది బిజెపి. బీసీల సంక్షేమం కోసం కులగణన చేసి వారికి న్యాయం చేకూర్చేది కూడా బిజెపినే అని అన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికే డెయిరీ ఏర్పాటు

- ఎమ్మెల్యే రేవూరి



✍ జయభేరి, పరకాల, అక్టోబర్ 17:

శుక్రవారం హనుమకొండ భవాని నగర్ లోని తన నివాసంలో పరకాల మహిళా పాల డైరీ పై అధికారులు, పరకాల మహిళా పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ కార్యవర్గ సభ్యులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరకాల మహిళా డెయిరీ విజయవంతంగా నిర్వహించేందుకు కమిటీని ఏర్పాటు చేసుకున్నాము అని, మహిళలు తలుచుకుంటే సాధించలేనిది అంటూ ఏమీ లేదన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి చెందడం ద్వారా ఆ కుటుంబాలు ముందుకెళ్తాయన్నారు. మహిళలు ఐక్యమత్యంగా ఉండి అనేక రంగాలలో విజయవంతంగా ముందుకు వెళ్తున్నారని అన్నారు. మహిళలు పరస్పర సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్న ములుకనూరు మహిళా డెయిరీ మహిళా శక్తికి నిదర్శనం అని అన్నారు. ములుకనూరు డెయిరీ మాదిరిగానే పరకాల మహిళా డెయిరీ కూడా రానున్న రోజుల్లో విజయవంతంగా నడవాలన్నారు. పాల డెయిరీ నిర్వహణకు పట్టుదలతో పని చేసి స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. డైరీలో సభ్యుల సంఖ్య పెరిగే విధంగా అవగాహన కల్పించాలన్నారు.



# నెగిటివ్ ప్రచారమే అస్త్రం

**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 17:**




హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నియోజకవర్గం జూబ్లీ హిల్స్‌లో ఉపఎన్నిక బరిలో ప్రధాన పార్టీలన్నీ తమ శక్తిని ప్రదర్శిస్తున్నాయి. నవంబర్ 11న జరగనున్న పోలింగ్ దేశవ్యాప్తంగా దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటి వరకు మూడురోజుల్లోనే 33 నామినేషన్లు దాఖలు కావడం ఎన్నికల వేడిని స్పష్టంగా చూపిస్తోంది. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం. మాగంటి గోపీనాథ్ మరణంతో ఎన్నిక వచ్చింది. ఈసారి బీఆర్ఎస్ మాగంటి సునీతను బరిలో దించింది. అందరికన్నా ముందే అభ్యర్థిని ప్రకటించి ప్రచారంలో ముందు ఉంది. పార్టీలో కీలక నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఆమె తరఫున బహిరంగ సభల్లో పాల్గొంటున్నారు. బీఆర్ఎస్ ప్రధాన వ్యూహం.. 'స్థిరత్వం, స్థానిక అభివృద్ధి' అనే అంశాలపై ప్రజల్లో నమ్మకం కల్పించడం. అదే సమయంలో నకిలీ ఓట్ల వ్యవహారంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి రాజకీయ అజెండాను మలచిందిమాజీ ఎంఐఎం అభ్యర్థి నవీన్ యాదవ్ ఇప్పుడు కాంగ్రెస్ తరఫున బరిలో దిగుతున్నారు. నియోజకవర్గంలో యువత, బీసీ వర్గాలపై పెద్దగా దృష్టి పెట్టిన ఆయనకు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ బలమైన మద్దతు అందిస్తున్నారు. కాంగ్రెస్ వ్యూహం సులభం.. "భారాస పాలనలో అసమానతలు, అవినీతి, నిరుద్యోగం" అనే అంశాలను ప్రజల ముందుంచి స్వరూప మార్పు అవసరమని ప్రజా ప్రచారం.భారతీయ జనతా పార్టీ నుంచి లంకల దీపక్ మళ్లీ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఓటమి ఎదురైనా, ఈసారి జాతీయ నాయకత్వం మద్దతుతో ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు.భాజపా వ్యూహం.. 'రెండు పార్టీల దుర్వినియోగం మధ్య శుభపాలన ప్రత్యామ్నాయం' అనే కథనంపై ఆధారపడి ఉంది. కేంద్రమంత్రులు రాబోయే రోజుల్లో ప్రచార బరిలోకి దిగనున్నట్టు సమాచారం.రీజనల్ రింగ్ రోడ్ నిర్వాసితులు, నిరుద్యోగులు, బీసీ రిజర్వేషన్ ఉద్యమకారులు కూడా నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. వీరి దాఖలాలు అధికార పక్షాలపై ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. ప్రజాస్వామ్య హక్కుల ప్రాతిపదికన వీరి ప్రయత్నం ఈ ఎన్నికను మరింత ఉత్కంఠభరితంగా మార్చుతోంది.కాంగ్రెస్ నకిలీ ఓట్లతో గెలవాలని చూస్తోందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఆ ఓట్లు గత ప్రభుత్వ కాలంలో బీఆర్ఎస్ చేర్చినవే అని కాంగ్రెస్ తిప్పి కొడుతోంది. ఇక బీజేపీ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని ఆరోపిస్తోంది. ఈ మాటల యుద్ధం ప్రస్తుతానికి ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. సోషల్ మీడియాలో నాయకుల ప్రత్యుత్తరాలు, రోడ్‌షోల్లో హోరెత్తే నినాదాలు ఎన్నిక వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి.జూబ్లీహిల్స్ ఓటర్ల మద్దతు, కుల సమీకరణలు, అభివృద్ధి అభ్యర్థి గెలుపులో నిర్ణయాత్మకమవుతాయి. బీఆర్ఎస్ సానుభూతి వ్యూహం ముందుకు రావడంతో, కాంగ్రెస్, భాజపా ఆధిపత్యం సాధించడానికి ప్రబల ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ ఉపఎన్నిక కేవలం ఒక స్థానిక పోరు కాదు – ఇది హైదరాబాద్ నగర రాజకీయ దిశను నిర్ణయించే పరీక్ష. మూడు ప్రధాన పార్టీలకు ఇది ప్రతిష్ఠాత్మక సమరం, ప్రజలకైతే అభివృద్ధి, విశ్వసనీయతకు పరీక్ష.



## గ్రామీణ స్థాయిలో ప్రజలు తిప్పి కొట్టాలి

**జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 17:**

బీసీ రిజర్వేషన్లు అడ్డుకుంటున్న బిజెపిని గ్రామీణ స్థాయిలో ప్రజలు తిప్పి కొట్టాలని సిపిఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్ అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి రాష్ట్ర గవర్నర్, రాష్ట్రపతికి పంపి నెలలు గడుస్తున్నా వాటిని ఆమోదించకుండా ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తూ ఎన్నికలను గందరగోళ పరుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కొక్కొండ లింగయ్య, తలారి మాతయ్య, గడ్డమీది నరసింహ, తూటి వెంకటేశం, సిలువేరు పెంటయ్య, సిఐటియు నాయకులు గుండెబోయిన బలరాం, కట్కూరి వెంకటేష్ పాల్గొన్నారు.

## అధికారులకు కానరాని ప్రజా సమస్యలు

- ప్రజల అవస్థలు అధికారులకు పట్టదా..?
- పసి పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న అధికారులు
- దోమల దండయాత్ర తో అవస్థలు పడుతున్న ప్రజలు



**జయభేరి, గార్ల, అక్టోబర్ 17 :**

మండల పరిధిలోని చిన్నకిష్టాపురం గ్రామపంచాయతీలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన క్రీడామైదానం క్రీడాకారులకు అసౌకర్యంగా మారిపోయి డంపింగ్ యార్డును తలపిస్తుంది. క్రీడా మైదానం అతి సమీపంలోనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రం, గ్రామపంచాయతీ కార్యాలయం ఉండటంతో చెత్త పేరుకుపోయి, దానిని కాల్చడం వల్ల వచ్చే పొగతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. పసి పిల్లల ప్రాణాలతో ప్రభుత్వ అధికారులు చెలగాటమాడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమల దండయాత్రతో ప్రజలు అవస్థలు పడుతున్న పాలకులకు గానీ, అధికారులకు గానీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో శుభకార్యాలు జరిగినప్పుడు అక్కడ తిని పడేసిన వ్యర్థాలను,ఇంట్లో చెత్త,ఖాళీ సీసాలు అన్నింటిని మూట కట్టుకొని క్రీడా మైదానంలో పడేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు తక్షణమే దృష్టి సారించి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

# అపార్ట్ మెంట్ వద్దనుకుంటున్నారోచ్



**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 17:**

కాస్త దూరంగా పోయి అయినా ఇండిపెండెంట్ ఇళ్లే కొనాలనుకునేవారు చాలా మంది ఉన్నారు. అలాంటి వారి కోసం హయత్ నగర్ హాట్ ఫేవరేట్ గా మారింది. చిన్న బిల్డర్లు 100 చదరపు గజం నుంచి 300 చదరపు గజాల వరకు ఇళ్లను నిర్మిస్తున్నారు, ధరలు ₹45 లక్షల నుంచి ₹1 కోటి వరకు చెబుతున్నారు. హయత్‌నగర్ చుట్టూ రెసిడెన్షియల్ ప్లాట్లు ఇంకా అందుబాటులో ధరల్లోనే ఉన్నాయి, ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో చదరపు గజానికి ₹35,000 నుంచి ₹50,000 వరకు. పెద్ద అంబర్‌పేట్‌లో ₹32,000 నుంచి ₹54,000 వరకు, పసుమాముల , తట్టి అన్నారంలో ₹42,000 నుంచి ₹60,000 వరకు ధరలు ఉన్నట్లుగా రియల్ ఎస్టేట్ బ్రోకర్లు చెబుతున్నారు.హయత్‌నగర్ సమీపంలో భూమి ధరలు ఇతర ప్రాంతాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి. ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో ఎకరానికి ₹34.5 కోట్లు, కొంచెం లోపల ₹23 కోట్లు. రియల్ ఎస్టేట్ నిపుణులు, రీజియనల్ రింగ్ రోడ్ మరియు రింగ్ రైల్ వంటి అవసర సదుపాయాలు మొదలైన తర్వాత భూమి మరియు రెసిడెన్షియల్ ప్లాట్ ధరలు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. అపార్టుమెంట్లు కూడా విరివిగా నిర్మిస్తున్నారు. చదరపు అడుగుకు ₹3,400 నుంచి ₹4,200 వరకు. డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్: ₹45 లక్షల నుంచి ₹52 లక్షలు. ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్: ₹55 లక్షల నుంచి ₹65 లక్షలు. రామోజీ ఫిల్మ్ సిటీ చుట్టూ కొన్ని డెవలపర్లు విల్లాలు నిర్మిస్తున్నారు. హయత్‌నగర్‌కు ఔటర్ రింగ్ రోడ్, విజయవాడ జాతీయ రహదారి ద్వారా మెరుగైన కనెక్టివిటీ ఉంది. సమీపంలో రామోజీ ఫిల్మ్ సిటీ, సంఘి టెంపుల్, మౌంట్ ఓపెరా వంటి ఆకర్షణలు ఉన్నాయి. ఇంజనీరింగ్ , ఫార్మా కాలేజీలు ఉన్నాయి. రీజినల్ రింగ్ రోడ్ , రీజియనల్ రింగ్ రైల్ ప్రాజెక్టులు హయత్‌నగర్‌ను మరింత అభివృద్ధి చేస్తాయి. హయత్‌నగర్‌లో చాలా మంది కొనుగోలుదారులు ప్రాపర్టీలను ఇన్వెస్ట్‌మెంట్ పరంగా కొంటున్నారు.



## స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అతలపోటీలు

**జయభేరి, పరవాడ:**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2025 2026 ఏడాది గాను విశాఖ జిల్లా ఇంటర్మీడియట్ విద్య శాఖ అదేశాలు మేరకు అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో ఉమ్మడి జిల్లా ఆటలాపోటీలు స్థానిక ఎస్ వి ఎస్ కళాశాల ప్రగణంలో జిల్లా డి ఐ ఈ వో ఎమ్ వినోద్ బాబు ఆధ్వర్యంలో ఎస్ జీ ఎఫ్ అండర్ 19 బాల బాలికల జిల్లా స్థాయిలో కబడ్డీ,చెస్ మరియు యోగసన విభాగాలలో పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలకి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయిలో అండర్ 19 బాల బాలికల పోటీలకు ఎంపిక చేసి పంపిస్తున్నట్టు సెక్రటరీ వి ఏ పుష్ప లత అన్నారు.

## లారీ బోల్తా పడి డ్రైవర్ కు తీవ్ర గాయాలు



**జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 17:**

లారీ బోల్తా పడి డ్రైవర్ కు తీవ్ర గాయాలైన సంఘటన తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామ పరిధిలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ నుండి ఖమ్మం దాన లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా లారీ వస్తుండటంతో కల్వర్టు చిన్నగా ఉన్నదని రోడ్డు పక్కకు అనేసరికి లారీ బోల్తాపడి డ్రైవర్ కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదకరంగా మారిన కల్వర్టును వెడల్పు చేయాలని వాహనదారులు కోరారు. కల్వర్టుపై రక్షణ గోడ లేకపోవడం వల్ల ప్రమాదం జరిగిందని అన్నారు




## కొండ భీమనపల్లి గ్రామంలో ప్రత్యేక శీతాకాల శిబిరం ఏర్పాటు

**జయభేరి, దేవరకొండ :**

ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజ్ దేవరకొండ ఎన్ఎస్ఎస్ యూనిట్ 1ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 కొండ భీమనపల్లి గ్రామంలో ప్రత్యేక శీతాకాల శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి పసుపుల ఎండిఓ డానియల్ గారు విశిష్ట అతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు పరిశుభ్రత పట్ల ,ఓటు హక్కు గురించి యువత సమాజ సేవ పట్ల తమ బాధ్యతను గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ చైర్మన్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి శ్రీదేవి ఎన్ఎస్PO జబ్బు కవిత,R. సుచరిత ,పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ ఏపీఓ ఇర్మియ పాల్గొనడం జరిగింది.

## శ్రీశ్రీ కాళిక మాత నూతన విగ్రహ ప్రతిష్టాత్మక కార్యక్రమం

- BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్



**జయభేరి, పి ఏ పల్లి :**

పీ ఏ పల్లి మండలం అజ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలో నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్ ప్రాంతంలో నూతనంగా కొలువు తీరిన శ్రీ శ్రీ కాళికామాత నూతన విగ్రహా ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్. ఈ కార్యక్రమంలో BRS అజ్మాపురం మాజీ సర్పంచ్ రామకృష్ణ ,గ్రామ శాఖ అధ్యకులు గోవర్ధన్, యాదవ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, మల్లా పురం మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, మాజీ సర్పంచ్ అమ్రు,శ్రీను,కొట్టాల గద్ద మోహన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ బహూకరణ



**జయభేరి, దేవరకొండ :**

మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (A) దేవరకొండలో శ్రీ సత్య సాయి సేవా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో కళాశాల నుండి ప్రథమ బహుమతి జి జానకి ద్వితీయ బహుమతి కే శిరీష తృతీయ బహుమతి జి జాహ్నవి లకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమావతి రవి చేతుల మీదుగా సర్టిఫికెట్స్ మరియు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సేవ ట్రస్ట్ తరపున సత్యనారాయణ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి లింగమయ్య తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలికల ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేత



**జయభేరి, పరవాడ:**

అక్టోబర్ 11 అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐ.సి.డి.ఎస్ సబ్బవరం వారి ఆధ్వర్యంలో పరవాడ మండల పరిధిలో వున్న బాలికల ఉన్నత పాఠశాలల్లో బాలికలకు ఆటలు, వ్యాసరచన, డిబేట్ పోటీలను నిర్వహించారు. ఈ ముగింపు వేడుకల సందర్భంగా విద్యార్థిని లకు మండల కేంద్రం పరవాడ మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం కూటమి నేతలు చేతుల మీదుగా అధికారులు సమక్షంలో బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కూటమి నేతలు మోటూరి సన్యాసినాయుడు, చింతకాయల సుజాత,బండారు కల్పన, వియ్యపు చిన్న, తహసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో రమేష్ నాయుడు, సిడిపిఓ లలిత కుమారి,సూపర్ వైజర్లు శ్యామల కుమారి, రమణి, లక్ష్మి, అధ్యాపకులు, అంగన్వాడి టీచర్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు.




# రిలాక్సింగ్ మూడ్‌లో రిషబ్ శెట్టి.. ఫోకస్ అంతా జైహనుమాన్‌పైనే..!

కాంతార చాప్టర్ 1తో రిషబ్ శెట్టి బ్లాక్ హిట్ కొట్టాడని తెలిసిందే. ఇప్పటిదాకా కాంతార పనులతో బిజీగా ఉన్న రిషబ్ శెట్టి ఇక రిలాక్స్ అయిపోయి తన నెక్స్ సినిమాపై ఫోకస్ పెట్టాడన్న వార్త ఇప్పుడు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. హనుమాన్ సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ సంపాదించాడు టాలీవుడ్ డైరెక్టర్ ప్రశాంత్‌వర్మ. హనుమాన్ చిత్రానికి సీక్వెల్ జై హనుమాన్ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో హనుమాన్ పాత్రధారిగా కాంతార హీరో రిషబ్ శెట్టి కనిపించబోతున్నాడు. రిషబ్ శెట్టి హనుమంతుడిగా రాముడి ప్రతిమను పట్టుకొన్న లుక్ ఇప్పటికే సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తుంది. మాటను నిలబెట్టుకోవడం ధర్మానికి మూలం. త్రేతాయుగం నుండి ఒక ప్రతిజ్ఞ.. కలియుగంలో నెరవేరుతుంది.. అంటూ హనుమంతుడి విధేయత, ధైర్యం, భక్తి, ఇతిహాసాన్ని మన ముందుకు తీసుకురాబోతున్నట్టు మేకర్స్ ఇప్పటికే క్లారిటీ ఇచ్చేశారు. తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ షూటింగ్‌ను ప్రశాంత్ వర్మ టీం డిసెంబర్ లో షురూ చేసేందుకు ప్లాన్ చేస్తుందట. ప్రశాంత్ వర్మ ఇప్పటికే సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉన్నాడట. మైసూర్‌లోని చాముండేశ్వరి టెంపుల్ సందర్శించిన సమయంలో తన నెక్స్ సినిమా జైహనుమాన్ అని కూడా చెప్పాడు రిషబ్ శెట్టి. ఇక రిషబ్ శెట్టి కూడా ప్రస్తుతానికి కేవలం జై హనుమాన్‌పైనే ఫోకస్ పెట్టనున్నాడని అర్థమవుతోంది. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్, రవిశంకర్ నిర్మిస్తున్నారు. కాంతార లాంటి సినిమాతో గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన రిషబ్ శెట్టితో ప్రశాంత్ వర్మ సినిమా చేస్తుండటంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి. రిషబ్ శెట్టి మరోవైపు ఛత్రపతి శివాజీ మహరాజ్ మూవీలో కూడా నటిస్తున్నాడని తెలిసిందే.

# ఇది నిజంగా ఊహించని ట్విస్ట్?




'బలగం' వేణు దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మించనున్న 'ఎల్లమ్మ' సినిమాలో కథానాయకుడిగా నటించేదెవరు? అనే విషయం ఇన్నాళ్లూ ఓ ప్రహసనంగా సాగింది. ఈ క్రమంలో చాలామంది హీరోల పేర్లు వినిపించాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం అగ్ర సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఇందులో హీరోగా నటించే అవకాశాలున్నట్టు ఫిల్మ్ సర్కిల్స్‌లో ఓ ఊహించని వార్త బలంగా వినిపిస్తున్నది. గత పదిహేనేళ్లుగా దేవిశ్రీని కథానాయకుడిగా పరిచయం చేసేందుకు చాలా ప్రయత్నాలు జరిగాయి. కానీ ఆయన మాత్రం ససేమిరా అంటూ వచ్చారు. అయితే.. ఎందుకో 'ఎల్లమ్మ' కథ విని ఆయన ఆలోచనలో పడ్డట్టు ఫిల్మ్ వర్గాల సమాచారం. కొందరైతే ఇది ఎల్లమ్మతల్లి నిర్ణయమేనంటూ పోస్టులు పెడుతున్నారు. అదే నిజమైతే 'ఎల్లమ్మ' సినిమా స్థాయి ఇంకాస్త పెరిగినట్టే. ఇందులో కథానాయికగా కీర్తి సురేశ్ దాదాపుగా ఖరారైనట్టు తెలుస్తున్నది. ఈ సినిమాకు సంబంధించిన ఇతర వివరాలు తెలియాల్సివుంది.

# సెగలు పుట్టిస్తోన్న దివ్య భారతి..




తొలి చిత్రంతోనే నెట్టింట విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఆ తర్వాత తమిళంలో వరుస సినిమాల్లో నటించి స్టార్ డమ్ సొంతం చేసుకుంది. ఇప్పుడు సుడిగాలి సుధీర్ సరసన తెలుగులో ఓ మూవీ చేస్తున్న సంగతి తెలిసిందే. చాలా రోజులుగా వీరిద్దరి కాంబోలో రాబోయే ప్రాజెక్ట్ షూటింగ్ జరుగుతుండగా.. విడుదలైన ఫోటోస్ ఆకట్టుకున్నాయి. ఇదిలా ఉంటే.. ఓవైపు సినిమాలు చేస్తూనే.. మరోవైపు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా రెడ్ డ్రెస్ లో గ్లామర్ ఫోజులతో మతిపోగొట్టేస్తుంది ఈ వయ్యారి. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ నెట్టింట వైరలవుతున్నాయి. ఇంతకీ ఈ రెడ్ డ్రెస్ ఫోటోలను మీరు చూశారా.. ? ఈ బ్యూటీ డ్రెస్ లో సెగలు పుట్టిస్తుందని.. దివి నుంచి భువికి దిగి వచ్చిందా అన్నట్లు ఉందంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. సినిమాల కంటే పర్సనల్ విషయాలతో దివ్య భారతి ఎక్కువగా పాపులర్ అయ్యింది. తన ఫస్ట్ హీరో జీవీ ప్రకాష్ తో ప్రేమలో ఉందని.. వీరిద్దరు కొన్నాళ్లుగా డేటింగ్ లో ఉన్నారంటూ ప్రచారం జరిగింది. అయితే తన గురించి వస్తున్న రూమర్స్ పై స్పందించిన దివ్య భారతి.. ఆ వార్తలు నిజం కాదని తెలిపింది. జీవి ప్రకాష్ కుటుంబ సమస్యలతో తనకు ఎలాంటి లింక్ లేదని.. తాను ఎవరితో డేటింగ్ లో లేను అని.. ముఖ్యంగా పెళ్లైన వ్యక్తితో డేటింగ్ అసలే చేయనని. ఆధారాలు లేకుండా రూమర్స్ పుట్టించొద్దు అని గట్టిగానే రియాక్ట్ అయ్యింది.

# నాలుగేళ్లుగా ట్రై చేస్తున్నా..

బిగ్ బాస్ హౌస్ లోకి ఎంట్రీ ఇవ్వాలని నాలుగేళ్లుగా ట్రై చేస్తున్నా అని ఆమె స్వయంగా చెప్పింది. అలాగే ఆమె కమిట్మెంట్స్ గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు తెగ వైరల్ అవుతున్నాయి. ఇంతకూ ఆమె ఎవరంటే..ఆమె పేరు రేఖ భోజ్.. పలు షార్ట్ ఫిలిమ్స్, కొన్ని సినిమాల్లో నటించింది ఈ అమ్మడు. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. నా కెరీర్ బిగినింగ్ లో కొన్ని షార్ట్ ఫిలిమ్స్ చేశారు. అలాగే కవర్ సాంగ్ చేశా.. నా బంగారుగాజులు అమ్మి సాంగ్ చేశా.. ఈ సాంగ్ వల్లే మాంగళ్యం సినిమాలో ఆఫర్ వచ్చింది. ఆతర్వాత వరుస ఆఫర్స్ వచ్చాయి. నాకు ఐదారేళ్లుగా మంచి ఆఫర్స్ వస్తున్నాయి. కొంతమంది కమిట్మెంట్స్ అడుగుతున్నారు. అలాంటి వారికి గట్టిగానే కౌంటర్లు ఇచ్చా.. బంగ్లా రాసిస్తా.. అది ఇస్తా.. ఇది ఇస్తా అంటూ ఆఫర్స్ ఇస్తున్నారు. అలాంటివి చేస్తే ఇప్పటికే నేను చాలా సంపాదించేదాన్ని.. నా దగ్గర ఉన్న వస్తువులను అమ్ముకుంటూ నిలదొక్కుకుంటున్నా.. అని చెప్పుకొచ్చింది. నాతో సినిమా చేయడానికి నిర్మాతలు ఎవరూ ముందుకు రావడం లేదు.. నేనే ఓ సినిమా చేస్తా.. నా కిడ్నీ అమ్మైనా సినిమా చేస్తా.. పాపులారిటీ కోసం బిగ్ బాస్ కు వెళ్లాలని ట్రై చేస్తున్నా.. నాలుగేళ్లుగా ట్రై చేస్తూనే ఉన్నా.. గతేడాది ఇంటర్వ్యూ కూడా అయింది. దాదాపు ఫైనల్ అయ్యాను. మరో వారంలో షో మొదలవుతుందని అనుకునేలోగా నన్ను రిజెక్ట్ చేశారు. ముక్కు మొహం తెలియనని వారిని బిగ్ బాస్ లోకి తీసుకుంటున్నారు. నాకు ఛాన్స్ ఇచ్చి ఉంటే దాన్ని బాగా వాడుకునే దాన్ని. సీజన్ 9కి కూడా ట్రై చేశా కానీ అదృష్టం కలిసి రావడం లేదు అని చెప్పుకొచ్చింది.



# 30 కోట్ల బడ్జెట్.. 300 కోట్ల కలెక్షన్స్.. బాక్సాఫీస్‌ను శాసించిన సినిమా..



ఎలాంటి అంచనాలు, హడావిడి లేకుండా విడుదలైన ఓ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. కేవలం 30 కోట్లతో తెరకెక్కించిన ఈ మూవీ దాదాపు 300 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టి తిరుగులేని రికార్డ్స్ క్రియేట్ చేసింది. దక్షిణాది నుంచి వచ్చిన ఈ మూవీ సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతుంది. ఇప్పుడు ఈ మూవీ ఓటీటీ లోకి వచ్చేందుకు రెడీ అయ్యింది. 2025లో బాక్సాఫీస్ వద్ద అనేక చిత్రాలు సూపర్ హిట్ అయ్యాయి. ఎలాంటి హడావిడి లేకుండా వచ్చిన సినిమాలు.. మంచి విజయాన్ని అందుకున్నాయి. కూలీ, హిట్ 3, తుడురమ్, ఎల్ 2 ఎంపురాన్ చిత్రాలకు మంచి రెస్పాన్స్ వ్చచింది. కేవలం 30 కోట్లతో తెరకెక్కించిన ఓ సినిమా బాక్సాఫీస్ వద్ద దాదాపు 300 కోట్లు రాబట్టింది. చాలా తక్కువ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం కేవలం మౌత్ పబ్లిసిటీ బలంతోనే మంచి రెస్పాన్స్ అందుకుంది. అంతేకాదు.. వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న ఓ హీరోయిన్ కెరీర్ మలుపు తిప్పింది.

ఈ సినిమాతో ఆమె పేరు మారుమోగింది. ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద అతిపెద్ద హిట్‌గా నిలిచింది. ఆ సినిమా పేరు కొత్త లోకా చాప్టర్ 1 చంద్ర. కేవలం రూ.30 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూలు చేసింది. ఇందులో కళ్యాణి ప్రియదర్శన్ ప్రధాన పాత్రలో నటించింది. ఆమె ఇందులో మహిళా సూపర్ హీరో పాత్రను పోషించింది. ప్రమోషన్లకు అంతగా డబ్బు ఖర్చు చేయలేదు. కానీ విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. మొదటి వారం ఆదివారం నాటికి, ఈ చిత్రం రూ. 10 కోట్లు సంపాదించింది. ఇందులో చంద్ర పాత్రలో అద్భుతమైన నటనతో కట్టిపడేసింది కళ్యాణి. అవయవాల అక్రమ రవాణా ముఠాను ఆమె కనుగొంటుంది. ఈ సినిమా మొదటి వారంలోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల మార్కును దాటింది. మొదట ఈ చిత్రాన్ని మలయాళంలో విడుదల చేయగా.. ఆ తర్వాత తెలుగులోకి డబ్ చేశారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 301.45 కోట్లు వసూలు చేసింది. ఇక ఇప్పుడు ఈ సినిమా ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అడియన్స్. అయితే ఈ మూవీ ఓటీటీ స్ట్రీమింగ్ గురించి ఇంకా అఫీషయల్ ప్రకటన రాలేదు. కానీ అక్టోబర్ 23 నుంచి హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ కానున్నట్లు ప్రచారం జరుగుతుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**